# మహాప్రాదో... మహాగర్తో...

అవ్మే... అవ్మే...

ప్రక్కింటి అవ్వ పిలుస్తున్నది. ఆ విచిత్రమైన పిలుపు ఆమెదే.

నిన్నా మొన్నా ఎదురింటి మెట్ల మీద కూర్చుని మా యింటికేసి చూసింది, నేను కనబడితే పిలవాలని. పని వత్తిడి వలన నేను చూసీ చూడనట్లుగా తప్పించుకుంటున్నాను. ఇవాళ ఎందుకో వాకిట్లోకి వచ్చి పిలుస్తున్నది. ఏం జరిగిందో!

తన మనసుకు ఎక్కువ బాధ కలిగినప్పుడు ఓదార్పు కోసం రెండుసార్లు నా దగ్గరకు వచ్చింది ఇదివరలో. వృద్ధాప్యంలోకి ఒరిగిపోయిన ఆడవాళ్లందరకు వచ్చే బాధలే - ఎక్కువేమీ లేవు. కొత్తవేమీ కాదు. ప్రక్కనున్న ఇంట్లో ఒక వాటాలో వుండే శ్యామలమ్మ తల్లి ఈమె.

పొయ్యి మీద అప్పుడే పెట్టిన పాలగిన్నెని వదిలేసి గబగబా వెళ్లి తలుపు తీశాను. నన్ను పక్కకు నెట్టినట్లు తోసుకుంటూ లోపలికి వచ్చింది. ఆ తెంపరితనానికి కొద్దిగా ఆశ్చర్యం కలిగింది నాకు. ఆమెకు మా యింట్లో అంత చనువు లేదు మరి.

ఒంట్లో బాగా లేదేమో కొంచెం వడిలినట్లుగా కనిపించింది. ఆచ్ఛాదన లేని భుజాలు మరింత పలచగా కన్పిస్తున్నవి. ఇదివరలో గోధుమరంగు చర్మం మీద లేసుల్లాగా కన్పించిన ముడతలు యిప్పుడు చిక్కటి గీతల్లాగా కన్పిస్తున్నవి. ఈ వారంలోనే బాగా దిగజారింది అవ్వ.

తెల్లగా మెరిసే జుట్టుని అంటదువ్వి వెనక తెల్లని నైలాన్ బేండ్‌తో బిగించేది. ఇవ్వాళ ప్రాలుమాలిగ్గా వుందేమో, జుట్టు చెదిరి ముఖంలో అలసట కన్పిస్తున్నది. ఇప్పుడు వయసుతో శరీరం కుదించుకుపోయి వంగిపోయినా ఒకప్పటి భారీతనాన్నీ, ఎత్తరితనాన్నీ చూపే పొడవాటి చేతులు అవ్వ నడుస్తుంటే పైట కొంగులోన ఒకటీ, బయట ఒకటీ స్వేచ్ఛగా ఊగుతూ వుంటవి. ఒకప్పుడు పెద్దగా వున్నట్లు తెలిసే తీరైన ముక్కు మొహంలోనికి సర్దుకుంటున్నట్లున్నది ఇప్పుడు. కళ్ల చివర్లు వాలిపోయి పెద్ద తేనెరంగు కనుపాపల స్వచ్ఛతలో నుంచీ దిగులు కురుస్తున్నది యివాళ. ఆ తలా, భుజాలు, నడుము వంగిన తీరులో ఏదో ఒద్దిక - కట్టుబాట్ల చాటున నమ్రతలోకి ఒదిగిపోయిన భారతీయ స్త్రీత్వానికి ప్రతీకలాంటి మూర్తి అవ్వది.

ప్రకృతిలోని చైతన్యమంతా మందగించి మునలితనంలోకి జారిపోతూ. ఏడుస్తున్నట్లుగా చచ్చువానల్ని ఒలుకుతున్నవి ఋతుపవనాలు.

"ఈ బాధ పగోళ్లక్కూడా వద్దు!" చేతుల మీది వానచినుకుల్ని చీరకొంగుతో తుడుచుకుంటూ. ఒళ్లు జలదరించుకుంటూ ప్రకటించింది అవ్వ. "నేను కుప్పకాటిదాన్ని! టవున్లో బుట్టలా! నాకు అంతస్తు లేదు! నేనేం జేసినా తప్పే.... ఎవరన్నా వొస్తే యింటెనకుండాల్సిన దాన్ని..."

అవ్వ చాలా బాధపడుతూ వుందని గ్రహించి వంటింటి వేపు వేసిన అడుగును వెనక్కు తీసుకుని, "అవన్నీ నిన్నెవరూ అన్లేదుగదా.పూరికే నిన్ను నువ్వే బాధపెట్టు కుంటున్నావు!" అన్నాను.

"ఎవురూ అనక్కర్లా. నేనే అనుకుంటున్నా. ఎవురూ అనకపోయినా అర్థం అవుతాంది. నా మణుసు సెడిపోయింది" అన్నది.

'ఇంటి ముందర చింతబడితే
ఇంటిలోకీ వేరు పారే...
ఇంటిలోకీ వేరు పారీ
అనల కొనల సాగెరా...'

కాషాయగుడ్డల సాధువు వాకిట్లో నిలబడి పెద్దగా పాడుతున్నాడు.

పొయ్యి మీది పాలు యీపాటికి అడుగంటబోతూ వుంటాయని మనసు వెనుక హెచ్చరిక.

"నాకెందుకీ జలమ? ఇంకెన్నాళ్ళూ?" సందేహంగా, దిగులుగా ప్రశ్నించింది. "ఆ డాకటరు దగ్గరకెల్తే నీకు జబ్బేమీ లేదన్నాడు. ఇంకెన్నాళ్లు బతకాలో ఏమో! ఏం జేసేది?" అవ్వ గొంతు నిండా విసుగు, అసహాయత.

"అనల కొనలా సాగి పెరిగీ
కొమ్మ విరిగీ నేలబడితే
బ్రహ్మ వ్రాసిన వ్రాతరా..."

నేను కదలకపోవటం గమనించిన భిక్షగాడు గొంతు పెద్దది చేశాడు.

పాలు అడుగంటిన కమురు కంపు వెనక వంటింట్లోంచీ ముందు గదిలోకి వచ్చింది.

నేను పరుగెత్తుకుంటూ వెళ్లి స్టౌ ఆర్పేసి, పాలగిన్నెను సింకులో వేసి, బియ్యం పట్టుకొచ్చి భిక్షగాడికి వేశాను.

వాన వెలిసిన ప్రశాంతి.

కాని ఇవ్వాళ అవ్వ మామూలుగా లేదు. "నీకు అర్థంకాదు! నువ్వయితే నీ యిష్టమొచ్చినప్పుడు నిద్రపోతావు, లేస్తావు. నీ యిష్టమొచ్చింది చేసుకుంటావు, తింటావు. నేనో? ఎవరన్నా వేసిన ముద్ద వేసినప్పుడు తిని ఒకమూలన పడుండాల్సిన దాన్ని!" అన్నది.

అవ్వకేమైనా తినాలన్పించిందా?

"నీకేం కావాలో చెప్పు. పది రూపాయిలిస్తే బజార్లో కోరింది తెచ్చుకుని తినొచ్చు!" అన్నాను.

"నాకే తిండీ వొద్దు!" అన్నది తల అడ్డంగా ఊపుతూ. "నా దగ్గిర పది రూకలుంటే ఇందా అని ఎవురి చేతనన్నా బెడతా గాదా. అవ్వ యిచ్చిందని వాళ్లు అనుకొందురుగదా. ఏవన్నా కావాలనిపిస్తే కొంటాను గదా! ఎవరికన్నా యియ్యాలనిపిస్తే యిస్తునుగదా!" అన్నది తనలో తను మాట్లాడుకుంటున్నట్లు.

"నీకేవన్నా కొనుక్కోవాలనుంటే ఇరవయ్యో, పాతికో నేనిస్తాను తీసుకో" అన్నాను.

"నాకెందుకీ బాకీలు! ఈ చేత్తో ఎందరికి పెట్టానో!" అవ్వ కళ్లల్లో నీళ్లు యివ్వాళే చూస్తున్నాను. ఆ దిగులూ, ప్రాలుమాలికా, కన్నీళ్లు... "ఉప్పుకీ, సింతపండుకీ కావాలని ఒక రూక అప్పు జేసిందాన్ని గాదు! నా కొడుకు ఉద్యోగస్థుడైనాక ఎన్నడన్నా యిచ్చిన ఇరవై రూకల్లో పది తిని, పది దాచిపెట్టి ఒకరికిచ్చినదాన్ని. ఎన్నడూ అప్పుజెయ్యలా - లేదనుకోలా - ఒకరి దగ్గిర మానం పోగొట్టుకోలా. ఒకరి దగ్గర మాటపడలా - అట్టా బతికినదాన్ని... యిప్పుడు..." అంటూ ఆగిపోయింది.

అవన్నీ ఆమె విలువలు. ఆమె కాలమూ మారిపోయింది. ఆ విలువలూ పోయాయి. ఈ కాలం యీ అవ్వకి ఎలా అర్థం అవుతుంది?! ఒకరికి పెట్టాలనుకోవటం, అప్పు చెయ్యకుండటం, మానం, మాటపడకుండటం - ఇందుకా బ్రతకటం!

"ఇవాళ నా ఒంట్లో ఓపికుంది... చేసుకుంటున్నాను... జరుపుకుంటున్నాను... కొన్నేళ్లు పోయాక వయసు మీదపడితే, ఒంట్లో ఓపిక తగ్గిపోతే ఏ బిడ్డ పంచనో ఒదిగి వుండక నాకూ తప్పదుగదా" ఇంతకు మునుపెన్నడూ వూహించి కూడా వుండని నా బవిష్యత్తును అవ్వ కోసం చిత్రిస్తున్నాను.

"ముందే పోతే ఏ బాధా వుండదు!" బరువుగా తలూపుతూ మారాం చేస్తున్న చిన్నపిల్లలాగా అన్నది.

ప్రక్కింటి నుంచీ భిక్షగాని పాట పెద్దగా, అపస్వరాలతో విన్పించింది - ఆ ఇల్లాలు విన్పించుకోలేదో ఏమో!

"వెతికితే కనరాని వస్తువు
ఎక్కడున్నది గురువరా?
ఆత్మారాముడు పూజ చేసే
ఆత్మలో శోధింపరా..."

ఒక్క నిముషం నిశ్శబ్దంగా భిక్షగాడి పాట ఆలకించాము.

"మన చేతిలో ఏముంది? ఎప్పుడో ఒకనాడు పోవటం ఎవరికీ తప్పదు. అందాకా జరుపుకోవాలి మరి" అన్నాను.

అవ్వతో సంభాషణలు ఎప్పుడూ ఈ చివరకే వస్తాయి - బ్రతుక్కి లక్ష్యం బ్రతకటం

కానట్లూ, చావుకోసం ఎదురుచూడటమే అయినట్లూ!

"నేనూ ఎందరికో నీతులూ, న్యాయాలూ చెప్పినదాన్నే!" అవ్వ చిరాకుపడ్డది.

చెప్పాలనుకున్నదేదో వెనకే వుండిపోయి, అక్కర్లేని సంభాషణ దోవా, తెన్నూ లేకుండా సాగిపోతున్నది మరి!

"నీకేం గావాల ముసిల్దానికి! ఆ ముద్దా, గూడూ, గుడ్డ పీలికా - అంతేగదా. తిను, వుండు - మూలన పడుండు అన్నది కోడలు కొడుకు పోగానే. నేనేవన్నా అది గావాలి, యిదిగావాలి అని అడిగేదాన్నిగాదే!... పెట్టింది తిని పడున్నదాన్నే! అంత కనీసంగా మాట్లాడింది... అంత కేవలంగా మాట్లాడింది దిక్కులేనిదాన్నని!... బతుకంతా రోషానికి బడి సచ్చినదాన్ని... ఎవర్నీ ఎదవ అనలేదు. ఎవరిచేతా ఎదవ అనిపించుకోలేదు జలమలో... అట్టాటిదాన్ని 'నీదేముందిక్కడ? నీ సొమ్ము మూటలతో మోసకరాలా!... నీ సొమ్ము బళ్లతో దోలుకరాలా!' అని అడిగిందమ్మ...! చేతిలో చిల్లిగవ్వలేని అడముండని, ఎవరికి ఏమిస్తాను జెప్పు!... అది తోలేస్తే వచ్చి కూతురి మీద బడితిని. ఏందెచ్చినావీడ తింటానికని కూతురు అడక్కపోయినా దాని మొగుడడుగుతాడు, బిడ్డలడుగుతారు... అడగరా? కాళ్లతో చేసే పని సేతుల్తో జేస్తాం, రెయ్యాబగలూ బతుకంతా సేవ జెయ్యగలవాళ్లమేగాని, ఆడముండలం, ఎర్రని ఏగాణి ఏడనుండి తేగలం?... నువ్వేమన్నా జెప్పు, నా మణుసు చెడిపోయింది! ఏరుకు తినే ముండని, నాగ్గావల్సింది గుడ్డ పేలికా, ముద్దా! ఏనాడో నన్ను కడగాట్లో ఏసేసినారు.."

అలుపు తీర్చుకోడానికి ఆగింది అవ్వ. బ్రతుకులను సార్థకం చెయ్యగల శక్తీ, బలహీనులను అణగదొక్కే ఆయుధమూ కూడా అయిపోయింది డబ్బు!

అవ్వ ఆలోచనలు ఎక్కడెక్కడికో వెళ్లిపోతున్నట్లున్నవి. ఆ కళ్లు ఎటో చూస్తున్నవి జ్ఞాపకాలను పట్టుకోవాలన్నట్లు. "కుప్ప కాట్లో బుట్టినదాన్ని. పదేళ్లు పెరుగు గంప నెత్తినెట్టుకుని టవునుకు బోయి అమ్ముకుని తిరిగొచ్చి మిట్టమద్దేన్నం పలుదోమి కూడు దిన్నదాన్ని!... కడుపున బుట్టినోడు ఏడనో సదువుల్లోవుండి యింటికొస్తే - గడ్డిపరక సేతబట్టుకురాడు! - కోడిగుడ్లు పెరుగుతో సమస్తమూ పళ్లెం నిండా బెట్టి సేతులు కట్టుకు బయట నిలబడినదాన్ని. కోడికూర దెస్తే బిడ్డకి రెండోపూట బెట్టాలని నేను తిననిదాన్ని... ఎన్నడూ ఇంట్లో యిది లేదూ అని తెలవకుండా బెంచినా వాళ్లని! ఆనాడు యేదిగాని ఎక్కణ్ణుంచీ దెచ్చావు, ఎట్టా జేశావనిగాని, ఏం దిన్నావనిగాని ఎవురూ ఎప్పుడూ అడగలా.... యియ్యాళ మాకేంజేశావని నిలదీస్తే ఏంజెప్తాను జెప్పు! సరిగ్గా యిప్పుడా మాటే అడిగింది నా కూతురు! నేను దరిద్రపుదాన్నని నేను ఎన్నడూ అనుకోలా! నువ్వు దరిద్రపుదానివి, నీ కడుపున బుట్టిన యిద్దరం దరిద్రంలోనే వుండిపోయాం! అన్నది అమ్మణ్ణి. నివ్వు బతికినట్టు బతకటం అదొక బతుకా? అన్నది! అది కూతురేనా, నేను తల్లినా జెప్పు!... కలిగినదాంట్లో సర్దుకుని బ్రతకటం దరిద్రమా?"

చాలా దీనంగా వుంది అవ్వ గొంతు. ఆ దరిద్రమేదో తన సొంతమైనట్లూ ఇంకా

ఎక్కువ డబ్బు లేకపోవటం తన తప్పైనట్లు సంజాయిషీ యిచ్చుకుంటున్నదెందుకు! అనుకున్నాను. వేగంగా మారుతున్న కాలంతో విలువలన్నీ తారుమారవుతుంటే తల్లీబిడ్డలు ఒకర్నొకరు అర్థం చేసుకోవడం కష్టమే! అనుకున్నాను.

"నువ్వేమన్నా జెప్పు. నా మణుసే సెడిపోయింది! కన్ను మూసుకుపోయి లోకం మరుక్కపోయినప్పుడు తప్ప - కన్ను తెరిశానో, మణుసంతా పిచ్చిపిచ్చిగా అయిపోతది. ఈరోజు ఎట్టా గడిసేది అనిపిస్తది... నా కడుపు కాలిపోతదని అనుకోకుండా ఏద్దంటే అది అడిగేస్తే!... కట్టుకున్నోడూ పైసా నా పేరెట్టలా! నా పుట్టింటోరిచ్చింది తన పేరనే ఎట్టుకున్నాడు... నీ పేర నుంటే నీ ఎనక ఆడబిడ్డలకి పోతాదన్నాడు. కాలం దీరి తనేమో పైకెల్లిపోయినాడు... కడుపున బుట్టినోడూ ఒక్క పైసా నా పేరెట్టలా! నీకెందుకు అన్నీ మేం జూత్తామన్నాడు... ఒక్క కొడుకు...! నన్ను మంట్లో గలిపేసి, ఊళ్లో ఏ యింట్లో ఎసరు బెట్టకుండా, అందరికీ మూటబియ్యం వుడికించి పెట్టాల్సినోడు! మాయమ్మకేం తక్కువ జరగదన్నవోడు! వాడూ అర్ధంతరంగా సచ్చె! సివరికి ఎవరి సేతికి దొరికింది ఆళ్లట్టుకెల్లిరి. ముసిల్దాని సంగతి ఎవరూ అనుకోలా! ఇయ్యాల నువ్వెవరికేవిచ్చినావని అడిగితే ఏం జెప్పేది? ఎవురికేం జేసినావంటే ఏం జెప్పేది?! ఈ ఆడజలమే ఒద్దనిపిస్తా వుందిప్పుడు!... నా బతుకేంటో నాకే తెలియటంలా! ఇక్కడ నేనున్నాననిగాని, బతికాననిగాని అనుకునేదెవరు? నేను బోతే యాడవబోయేదెవరు? నా మణుసే సెడిపోయింది!"

కొంచెంసేపు ఊరుకుండిపోయింది అవ్వ. ఆవిడకి చెప్పడానికి నా దగ్గర సమాధానాలూ, ఓదార్పు మాటలూ లేవిప్పుడు. మనిషి అస్తిత్వానికి అర్థం చెప్పగలిగేది డబ్బేనా? వేరేమీ లేదా? అని కూడా అనుకున్నాను అయోమయంగా.

అవ్వ మళ్లీ మాట్లాడటం ప్రారంభించింది. "నేనేం బతుకు బతికానో, ఏంచేశానో నా గుంపుకు తెలుసు!" తనని తనే నమ్మించుకుంటున్నట్లు జోరుగా తలూపుకుంది పైకీ క్రిందికీ. "నాది పెద్ద గుంపు... నాతోటోళ్లంతా ఎల్లిపోయినారు. అయినా మావూళ్లో వుంటే ఎందరు నా సంగతి యిశారించేవోళ్లు! ఒంటిదానివి, ఏం జేసుకున్నావో తిన్నావో తినలేదో అంటారు. అందరూ అమ్మా, రా! అనే అంటారు. పసిబిడ్డకి కాళ్ల మీదేసుకు నీళ్లు బొయ్యాలంటే 'అవ్వని బిలూ' అంటారు. సలహా సందర్భం వస్తే 'అవ్వనడుగా' అంటారు... పాలోళ్లే ఎందరో వుండారు. నాకొడుకు జచ్చినప్పుడు అంతా వొచ్చి నీల్లు జల్లుకున్నారు.... నేను జచ్చినా అంతా రావాల్సిందే! తప్పకుండా వస్తారు. రాకుండా వుండరు! ఒచ్చి నెత్తిన నీల్లు జల్లుకోవద్దా!... మన పీనిగని మనం తీసికెళ్లి దహనం జేసుకోవాలి గదా, ఆయమ్మని గూడా కొడుకుని బెట్టిన తావుకే జేర్చాలిగదా అనుకుంటారు... అనుకోకుండా వుండరు..."

ఈ ఆలోచనతో అవ్వకి ఏదో అస్తిత్వపు పట్టు చిక్కినట్టై ముఖంలోకి స్థిమితం వచ్చింది. అవును, ఆమె లోకం ఎక్కడికీ పోలేదు. ఇక్కడే వుంది! వుంది! వుంది!

నేను హమ్మయ్య అనుకునేంతలోనే అవ్వకి బ్రతుకు చేజారిపోతున్నట్టి ఆలోచనలు

వచ్చేసినై. "మా వూర్నుంచీ నా గుంపు వచ్చినాగానీ అవ్వ ఎట్టా వుందని అడిగినా ఏదో జెప్తారుగానీ నన్ను పిలవరే! మాటాడనియ్యరే. వాళ్లే మాటాడి పంపించేస్తారే!... యిన్నాళ్లు లేనిది యిప్పుడు నేనేమన్నా తప్పు మాటాడతానా?"

ఆవిడ మనసు మళ్లీ ఏవో అగాధాల్లోకి జారిపోతున్నది! అనుకొని గబగబా మొదలుపెట్టాను. "బిడ్డల సంగతే అంత! మా అమ్మ సంగతే జెప్తా! ఎవరైనా మాతో మాట్లాడటానికి వచ్చినప్పుడు మా అమ్మ మా మాటల్లో కలగజేసుకుంటే మాకు బాగుండదు! ఇంతెందుకూ, నా చిన్నకొడుకు స్నేహితులు వచ్చినప్పుడు మేం మాట్లాడితే వూరుకోడు. చీటికీ మాటికీ నీకు తెలీదులేమ్మా! అంటున్నాడప్పుడే..."

తరాల అంతరాల గురించిన నా మాటలు అవ్వకు సమాధానం కాలేదు.

"చేతగాని ముసిలి కాలంలో ఏమ్మా, ఇదిట్టా, అదిట్టాగాదూ అని సంగతి జెప్తే - నేనూ ఒక మడిసినని, నాకూ బిడ్డలుండారని కడుపు సల్లగుంటే - నువ్వు బెట్టిన ముద్ద ఒల్లుబడతది. లేకుండా బోతే ఆ కుక్కేంటి? ఆ బిచ్చగాడేంటి? నేనేంటి?! కుక్కా తింటది, బిచ్చగాడూ కట్టుగుంటాడు. నీవు తెచ్చి పడేసింది తింటిని, ఇచ్చింది కట్టుకుంటిని... నాకిది గావాలి, అది గావాలని అన్లేదే... అమ్మా! అని ఒక్కమాట, అవ్వా! అని ఒక్కమాట... అది లేనప్పుడు ఏం తిన్నా ఒగిటే... పనికిరాని కూడు పిండాకూడే గదా... ఆకిరికి ఆ చిన్నముండ వుందే, అది గూడా అమ్మ మాటే మాటాడుద్ది! వాళ్లమ్మ జెప్తే ఒచ్చి, 'రా అవ్వా, తిందువు' అంటది. 'రా అవ్వా, నీల్లు బోసుకో' అంటది. ఎల్తే పెడతది, ఎల్లకపోతే వూరుకుంటది. అంతకుమించి ఒక్కమాట... ఒక్కమాట మాట్టాడదు! అది సిన్నగా వున్నప్పుడు దానమ్మ దాన్ని కొడతాదని లబలబలాడి పోయేదాన్ని. 'ఒద్దే, కొట్టొద్దే, పసిదే!' అని అడ్డంపడేదాన్ని. ఏడిస్తే ఎత్తుకొని అట్టా ఎవరింటికన్నా ఎత్తుకుపోయేదాన్ని. నేను దాచిన యాబయ్యా, పందా దానికే గుడ్డలు కుట్టించేదాన్ని... యియ్యాల సూడు! నా మాట ఎవురికీ పనికిరాదు! అసలు మణిసికీ బెమతలన్నీ ఎందుకున్నట్టు?... ఒకిరాశ అట్టా తీసెయ్యరాదమ్మ!.... బిడ్డలనుకొని వచ్చినాగాని యిట్లా వుంటారని తెలిస్తే, తినో, తినకో నా గుంపులోనే బడి సచ్చేదాన్ని!"

అవ్వ మాటల్లోకి క్రమంగా కొంచెం స్తిమితం వచ్చింది. ఆవేదనంతా వెలికివచ్చి చల్లబడుతున్నది. ఆమె ఆశ మనిషిని యివాల్టి నుంచీ రేపటికి నడిపించే ఆత్మవిశ్వాసం, రేపు సూర్యుడు ఉదయిస్తాడన్న నమ్మకం, రేపటిని నిర్మించుకోనిచ్చే జీవన ధర్మం. ఆశ తీసెయ్యరాదు, ఎంత సూక్ష్మంగా చెప్పింది! బలహీనులకు న్యాయం చెయ్యాలంటే ఎంత సంస్కారముండాలి మనిషికి! అనుకున్నాను బరువుగా.

"ఇంతకీ యిప్పుడేం జరిగిందీ చెప్పనేలేదు!" అన్నాను. నా వంటపని అట్లాగే మిగిలిపోయి వున్నదన్న తొందర లోపల వున్నది.

"ఆ ఒడ్లు ఎండబొయ్యకుండా మిసినీకేస్తే అన్నీ నూకలైపాయె! నూకలైతయ్యి, ఎండబొయ్యండని ముందే జెప్పినా సెవి నేసుకోకపోయిరి. ఒల్లొంగని పనులు. ఆ నూకలన్నీ

జూసి నాకు బాదయిపోయింది. అయ్యో! అన్నానమ్మ... యింకేమీ అనలా... అదీ తప్పేనంట!... కొట్లో మంచి బియ్యం తెచ్చుకుంటారంట. నేను నోరు మూసుక్కూచో లేదంట... ఎన్ని మాటలడిగింది నా కూతురు!... నా యిష్టంగా ఒబ్బిడిగా తింటా వుండినానంట యిన్నేళ్లూ!..." ఈ అన్యాయపు అలగా మాటను మనసులోనే మట్టుబెట్టి సమాధి జేసెయ్యాలన్న తపన ఒకవైపూ, అన్యాయాన్ని బహిర్గతం జేసి మనసును తేలికపరచుకోవాలన్న ఆరాటం మరొకవైపునా అవ్వ గొంతులో వినిపిస్తున్నవి. "ఎండిన సంగటి ముద్దనే మూడు మాట్లు తింటినే! ఒక్క కూర దెచ్చుకున్నదాన్ని కాదే - అది ఎరగదా?!... దిక్కుమాలిన ముసల్దాన్నని ఏమంటే అది అనటమేనా? అది కూతురా!... నా కడుపు కాలిపోదా!...." ఇంతవరకూ జెప్పి ఆగింది. ఉచ్చరించరాని మాట జెప్తున్నట్లు గొంతు తగ్గించి, కళ్లు పెద్దవి జేసింది. "ఎవురూ లేనిదాన్నని దరమానికి బెడ్తన్నదంట నాకు! సత్తేనికి దెచ్చిందంట నన్ను!... కన్నబిడ్డ ఆ మాట అన్నాక నా జలమ ఎందుకు జెప్పు!..?"

మాట పట్టింపుతో తింటున్నదో, లేదో - అవ్వకి కళ్లు వాలిపోతున్నవి. లోనికెళ్లి కొంచెం బర్ఫీ తెచ్చాను. "నాకొద్దు" అని తల అడ్డంగా ఊపింది. అరటిపండు తెచ్చి యిచ్చి తినమన్నాను. పండు తీసుకుని "ఈ బాకీలు ఎట్టా తీరాలి!" అనుకుంటూ పై తొక్క ఒలిచి ప్రక్కన బెట్టుకున్నది. పండు నెమ్మదిగా తిన్నది. శరీరమూ, మనసూ తేరుకుని మామూలు మనిషై యింటికెళ్లడానికి లేచింది. ఏమో ఆలోచించుకున్నది. "పోనీ, అదేంటో యియ్యి, చిన్నదానికి తీపి యిష్టం" అన్నది.

మనవరాలి కోసం బర్ఫీ పొట్లం ఒకచేత్తోనూ, ఇంట్లోని ఆవు కోసం అరటిపండు తొక్క రెండో చేత్తోనూ పట్టుకొని వెళ్తున్న అవ్వ వంగిన తీరూ, తెల్లటి చీరా, మెరిసే జుట్టూ ఆ లేత ఎండలో కర్పూరపు వెలుగు వెళ్తున్నట్లే వుంది!

★★★

ఈసారి వాకిట్లోనే నిలబడ్డది అవ్వ. అక్కణ్ణుంచే తన రాకకు సంజాయిషీ చెప్పింది. "మా వూరి నుంచీ మనవడొకడు వచ్చాడు. వాణ్ణీ చిన్నప్పుడు చంకనేసుకుని తిప్పీ, నీళ్లు పోసీ సాకానులే. ఇప్పుడు నన్ను మా పల్లెకు తీసుకెల్తాడంట... వీళ్లు కూడా ఎల్లమన్నారు. తరువాతెప్పుడో తీసుకొస్తారంట... నేనెల్తన్నా.... నీతో చెప్పకుండా ఎల్తే బావుండదు కదా... ఈవిడేమైపోయిందనుకోవూ?" సందేహిస్తూ ఆగింది. "పనిలో వున్నట్టున్నావు" అన్నది.

అవును, పని వత్తిడిలోనే వున్నాను! అయినా, "ఎప్పుడూ వుండే పనే గదా. చెప్పకుండా వెళ్లిపోతే ఎట్లా? మంచి పని చేశావు, వచ్చి, చెప్పి. నువ్వేమైపోయావని అనుకుంటానుగదా. రా, లోపలికి" అన్నాను.

జుట్టుకు బాగా నూనె రాసి, నున్నగా దువ్వి, వెనక గట్టిగా బిగించి ముడివేసింది.

మనిషి తేటగా కనిపిస్తున్నది. ముఖంలో ఎప్పుడూ కన్పించే ఆవేదన లేదు. కాని నాకు అర్థం కాని భావం ఏదో వుంది. ఈ అవ్వ ఊతకర్రలు విసిరిపారేసి నిబ్బరం పొందిన ధీరశాంత! ఉడిగిపోతున్న ముఖంలో, విప్పారిన కళ్లలో నుంచీ, తేనె రంగుకు తిరిగి పెద్దగా విస్తరించుకున్న కనుపాపలు ప్రపంచాన్ని తాపీగా, నిరాసక్తంగా వీక్షిస్తున్నవి. జీవితం ప్రసాదించే అనుభవాల్ని తాను గ్రహించకుండా ప్రతిఫలించే అద్దంలాగా వున్నదామె. ప్రపంచం తాలూకు మురికి అంతా అడుక్కుదిగిపోగా తేటదనం పొందిన నీటిచెలమలాగా వున్నది. విశాలమైన ఆవరణాన్ని నిలకడగా, నిరహంకారంతో ఎక్కడో దూరాన్నుంచీ చూస్తున్నట్లు, సుదీర్ఘమైన జీవితానుభవం ఒక యోగమై ఆ వీక్షణము నుంచీ జాలువారుతున్నట్లుగా భ్రాంతి కలిగిస్తున్నది.

ఇప్పటికైనా అవ్వకు స్తిమితం చిక్కుతున్నదని సంతోషించాను.

కాని అది నేననుకున్న తియ్యని సమాధానం కాదని తెలియపరుస్తూ

"అక్కడికెల్లమూ నాకిష్టం లేదు!" అన్నది మెల్లగా తలూపుతూ.

"ఎందువల్లా? ఇన్నాళ్లూ నా గుంపు, నా గుంపు అని చెప్తివిగదా!" అన్నాను ఆశ్చర్యంగా.

"ఏమో, వాళ్లకీ బరువైపోతానేమో!" అని ఆగింది. "అవును, బరువనుకుంటారు... నేనే ఒక బరువు" అన్నది దీర్ఘంగా చూస్తూ, నిశ్చయంగా తలూపుతూ.

ఏమిటీ, కొత్త గొడవ? అనుకున్నాను. "వాళ్లే యిష్టపూర్వకంగా తీసుకెళ్తున్నారు గదా! బరువని ఎందుకనుకోవడం?" అన్నాను.

ఆమె సమాధానం యివ్వలేదు. ముఖంలో పరిహాసపు నవ్వు విరుపు కన్పించి. ఆలోచనలో పడ్డాను.

మాటలు పొడిగించకుండా, వచ్చిన పని అయిపోయినట్లు యంత్రంలా లేచి నిలబడ్డది. తిరిగి చూడనైనా చూడకుండా తిన్నగా అడుగులేసుకుంటూ వెళ్లిపోయింది.

ఆమె మహాప్రస్థానం ప్రారంభమైంది. ప్రపంచపు అనేకత నుంచీ ఏకాకిదనంలోకి, నీరవతలోకి సాగే తిరుగులేని కఠోర ప్రస్థానం. అసంతృప్తి భారం లేకుండా వెళ్లి వుంటే బావుండేది అన్పించింది.

అవ్వ మా వూరికి తిరిగిరాలేదు. ఆమె చనిపోయిన విషయం రెండు నెలల తర్వాత ఊసుపోని కబుర్లలో దొర్లి వచ్చింది.

★★★